

న్యాయం జరగడం లేదయ్యా!
ఎన్ని సార్లు అర్జీలిచ్చినా న్యాయం జరగడం లేదని, సమస్యలు పరిష్కరించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. - 8లో



మళ్లీ వివాదం
చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మళ్లీ వివాదం రేగింది. భద్రత కల్పించాలంటూ పీజీ డాక్టర్లు నిరసనకు దిగారు. - 8లో



పూలంగి సేవ
కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి పూలంగి సేవ నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

ఆగని ఏనుగుల దాడులు



ఏనుగు విరిచేసిన కొబ్బరి చెట్టు

పులిచెర్ల(కల్లూరు): పంట పొలాలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. తాజాగా సోమవారం తెల్లారు జామున ఏనుగులు మండలంలోని కల్లూరు, తలారివారిపల్లె పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలను తొక్కిపాడేశాయి. కల్లూరుకు చెందిన రఫీ మామిడి చెట్లు, తలారివారిపల్లెకు చెందిన కోదండ పొలంలోని కొబ్బరి చెట్లు, జామ, మామిడి పంట, ధనుంజేయకు చెందిన డ్రిప్‌పైపులు, బోరు, మల్లికార్జునకు చెందిన మామిడి చెట్లను విరిచేశాయి. దాదాపు 13 ఏనుగుల గుంపు పంటలను నష్టపరిచినట్టు రైతులు పేర్కొన్నారు. పగటి పూట సమీప పెద్ద వంక, గోగులమ్మ వంకల్లో ఉండి రాత్రి పూట పొలాలపై దాడిచేస్తున్నట్టు వాపోయారు. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల కట్టడికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చెక్‌డ్యాం కూల్చివేత



జేసీబీతో కూల్చివేసిన చెక్ డ్యాం

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలోని చిచ్చిలివారిపల్లె గ్రామ పంచాయతీ, గురికివారిపల్లె సమీపంలో భూగర్భ జలాల అభివృద్ధి కోసం నిర్మించిన చెక్‌డ్యాంను కొందరు కూల్చివేశారు. 2018–19లో ఉపాధి పథకంలో రూ.5 లక్షల వ్యయంతో వంకలో ఈ చెక్ డ్యాంను నిర్మించారు. అయితే గత వారం క్రితం జేసీబీతో చెక్‌డ్యాంను కూల్చి వేశారు. వర్షం కురిసిన నీరు చెక్ డ్యాంలో నిలిచే పరిస్థితి లేదు. ఈ విషయమై ఎంపీడీవో, తహసీల్దార్, ఉపాధి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతు దొరబాబునాయుడు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని, చెక్ డ్యాం కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 36 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 36 వినతులు అందాయి. చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ రాంబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోపు పరిష్కారమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

మహిళల రక్షణపై శ్రద్ధ పెట్టండి



ద్రాక్షాయణి

చిత్తూరు కార్పొరేషన్: హోంమంత్రి అనిత మహిళల రక్షణపై శ్రద్ధ పెట్టాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ద్రాక్షాయణి సూచించారు. జగనన్న మీద అవాకులు, చవాకులు మాట్లాడడానికి మాత్రమే ఆమె ఎక్కువగా మీడియా ముందుకు వస్తారన్నారు. ఇటీవల ఆమె మెడికల్ కళాశాలల పై నిర్వహించిన ప్రెజెంటేషన్‌తో కూటమి ప్రభుత్వ అసమర్థత బయటపడిందన్నారు. 15 నెలల్లో కనీసం రూ.15 కోట్లు కూడా మెడికల్ కాలేజీల నిర్మాణానికి పెట్టలేదని దుయ్యబట్టారు. పీపీపీలపై కొత్త వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 77,893 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,604 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.53 కోట్లు ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

చిత్తూరులోని మురుగానపల్లిలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో 2022–23 విద్యాసంవత్సరంలో వినయ్ అనే విద్యార్థి ఇంటర్మీడియెట్ చదివాడు. ఇంటర్ పూర్తయ్యాక మరొక కళాశాల పేరుతో టీసీ ఇవ్వడంతో ఆ విద్యార్థి ఖంగుతిన్నాడు. ఆ సమయంలో అంత అవగాహన లేదు. ఆ టీసీ తీసుకుని ఉన్నత విద్య కోసం చెన్నైకి వెళ్లిపోయాడు. ప్రస్తుతం తన అవసరాల నిమిత్తం ఆ కళాశాలకు వెళ్లి స్టడీ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఆ కళాశాల సిబ్బంది అడ్మిషన్ రిజిస్టర్‌లో అతని పేరును వెతికితే కనబడలేదు. 'నీ పేరు ఇక్కడా లేదు.. నువ్వు ఎక్కడ చదివావు..? అంటూ క్లర్క్ సమాధానమిచ్చాడు. ఆ విద్యార్థికి...కళాశాల నిర్వాహకుల మధ్య వాదో పవాదాలు చోటు చేసుకున్నాయి. చివరికి ఆ విద్యార్థి పేరున మరొక కళాశాల అడ్మిషన్ రిజిస్టర్లో నమోదు చేసినట్లు కనిబెట్టి ఆ రికార్డులో ఉన్న వివరాల ప్రకారం స్టడీ సర్టిఫికెట్‌ను రాసి పంపించారు.

మాయాజాలం!



.. ఇది ఒక్క వినయ్ పరిస్థితే కాదు.. జిల్లాలోని చాలా ప్రయివేటు కళాశాలల్లో ఇదే తంతు. పలమనేరు, కుప్పం, పుంగనూరు, నగరిలో ఉన్న పలు ప్రైవేట్ కళాశాలల్లో మాయాజాలం కొనసాగుతోంది. ఎప్పటికప్పుడు అడ్మిషన్ రిజిస్టర్లను తనిఖీ చేసి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రయివేటు జూనియర్ కళాశాలలు అడ్మిషన్ల రిజిస్టర్లలో మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఒక కళాశాలలో చదివితే మరో కళాశాల నుంచి టీసీలిచ్చి పంపేస్తున్నాయి. అవగాహన లేక చాలా మంది మోసపోతున్నారు. ఉన్నత విద్యనభ్యసించాక స్టడీ కోసం వెళ్తే అసలు విషయం బయటపడుతోంది. ఇలాంటి కంత్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో కానరాని అడ్మిషన్ రిజిస్టర్లు
- చాలా కళాశాలల్లో ఎప్పటికప్పుడు నమోదుకాని విద్యార్థుల వివరాలు
- తనిఖీ చేయడమే మరిచిపోయిన ఇంటర్మీడియెట్ అధికారులు
- ఇదే అదునుగా పలు అక్రమాలకు తెరలేపుతున్న యాజమాన్యాలు

విద్యార్థుల భవిష్యత్ నాశనం

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 64 ప్రైవేట్ జూనియర్ కళాశాలలున్నాయి. ఈ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ బోర్డు నియమ, నిబంధనలను అమలు చేయాల్సి ఉండగా.. అక్రమాలకు తెరలేపుతున్నాయి. ఆయా కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్లిపోతోంది.

తనిఖీల్లో అలసత్వం

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ రిజిస్టర్‌ల నిర్వహణ గందరగోళంగా ఉంది. అలసత్వంతో పాటు అడ్మిషన్ రిజిస్టర్‌లో అక్రమాలకు పాల్పడుతున్నారు. ఒక్కో విద్యార్థి పేరును అడ్మిషన్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలంటే రెండేళ్లకు గాను రూ.20 వేల వరకు గుంజుతున్నారు. ఉదాహరణకు చిత్తూరు నగరంలోని మురుగానపల్లిలో ఉండే ప్రైవేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు 20 మందిని ఉత్తమ ర్యాంకుల కోసం జీడీ నెల్లూరులో ఉండే ఓ ప్రైవేట్ కళాశాలలో అడ్మిషన్ రిజిస్టర్‌లో పేర్లు రాయించారు. ఆ తర్వాత అక్కడే చదువుతున్నట్లు క్రియేట్ చేశారు. అక్కడ పేర్లను నమోదు చేసిన ఒక్కొక్క విద్యార్థికి రూ.20 వేల చొప్పున మొత్తం 20 మంది విద్యార్థులకు గాను రూ.4 లక్షలను మురుగానపల్లి కళాశాల నిర్వాహకులు జీడీ నెల్లూరు కళాశాల యాజమాన్యానికి చెల్లిస్తున్నారు.

జిల్లా సమాచారం

ప్రైవేట్ జూనియర్ కళాశాలలు	64
విద్యార్థుల సంఖ్య	75,897
అడ్మిషన్ రిజిస్టర్ల నిర్వహణలో లోపాలున్న కళాశాలలు	52
పక్కాగా అడ్మిషన్ రిజిస్టర్లు అమలు చేస్తున్న ప్రభుత్వ కళాశాలలు	31
అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ కళాశాలలు	36

పరిమితికి మించి విద్యార్థులు ఉండడంతో!

జిల్లాలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్మీడియెట్ బోర్డు నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయి. పరిమితికి మించి విద్యార్థులను అడ్మిషన్లు చేసుకుంటున్నారు. అలా అధికంగా అడ్మిషన్లు చేసుకున్న విద్యార్థుల వివరాలను నిబంధనల ప్రకారం అడ్మిషన్ రిజిస్టర్‌లో నమోదు చేసేందుకు అవకాశం లేదు. నిర్దేశించి గ్రూపునకు 88 మంది విద్యార్థులను మాత్రమే అడ్మిషన్ చేసుకోవాలి. అయితే జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో 300 మంది విద్యార్థుల వరకు ఒక్కొక్క గ్రూపులో అడ్మిషన్‌లు చేసుకుంటున్నారు. ఇలా అధికంగా ఉన్న విద్యార్థులను మరొక కళాశాలలోని అడ్మిషన్ రిజిస్టర్‌లలో అడ్మిషన్‌లు అయినట్టు రాయించి మోసాలకు పాల్పడుతున్నారు.

మోసాలకు అడ్డూ అదుపే లేదు



జిల్లాలోని అనేక ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ రిజిస్టర్లను సరిగా నిర్వహించడమే లేదు. ఈ విషయం ఇంటర్మీడియెట్ అధికారులకు సైతం తెలుసు. ఆ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. కొన్ని కళాశాలల్లో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు చేర్చుకుని నిబంధనలకు విరుద్ధంగా మరొక కళాశాలలో చదివినట్లుగా అడ్మిషన్ రిజిస్టర్‌లో పేర్లు రాయిస్తున్నారు. ఇలాంటి అవకతవకలు చాలా ప్రైవేట్ కళాశాలల్లో జరుగుతున్నాయి. తనిఖీలు చేయాల్సిన ఇంటర్మీడియెట్ అధికారులు అటువైపు కన్నెత్తే చూడటం లేదు.

– షేక్ రెడ్డిమస్తాన్, స్టూడెంట్ యూనియన్ జేఏసీ వైస్ చైర్మన్, చిత్తూరు జిల్లా

సామాన్యుల సమస్యలకే ప్రాధాన్యం



తన తల్లి సమక్షంలో బాధ్యతలు తీసుకుంటున్న చిత్తూరు ఎస్పీ దూడి

చిత్తూరు అర్బన్: సామాన్యుల సమస్యలను తీర్చడానికే పోలీసుశాఖ పనిచేస్తుందని తుషార్ దూడి అన్నారు. ఇటీవల జరిగిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా బాపట్లలో పనిచేస్తున్న ఈయన చిత్తూరులో సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. దూడి తన తల్లి సమక్షంలో చిత్తూరు 68వ ఎస్పీగా విధుల్లోకి చేరారు. పోలీసు అధికారులు స్వాగతం పలకగా.. మంత్రోచ్ఛారణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం దూడి మాట్లాడుతూ మహిళలు, పిల్లల సంరక్షణతో పాటు.. సామాన్యుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. రౌడీయిజాన్ని ఉపేక్షించేది లేదన్నారు. జిల్లాలోని పోలీసుల్లో వృత్తి నైపుణ్యత పెంచేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామన్నారు. ప్రజలకు పోలీసుశాఖపై నమ్మకం పెరిగేలా.. ప్రజలకు చేరువయ్యే కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తామన్నారు. జిల్లా ప్రజానీకానికి శాంతిభద్రతల సమస్య రాకుండా ప్రశాంతంగా ఉండే వాతావరణం కల్పిస్తామన్నారు.

సబ్–డివిజన్ల వారీగా సమీక్ష..

బాధ్యతలు తీసుకున్న తరువాత దూడి జిల్లాలోని సబ్–డివిజన్ల వారీగా డీఎస్పీలు, సీఐలతో సమీక్ష నిర్వహించారు. ఆయా సర్కిళ్లల్లో ప్రధాన సమస్యలు, నేరాల తీరుతెన్నును ఇన్‌స్పెక్టర్లు వివరించారు. సీఎంతో ఎస్పీల సమావేశం ఉండడంతో ఆయన విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

శోధించి..ఛేదించారు!

- భారీ చోరీ గుట్టువిప్పిన పలమనేరు పోలీసులు
- 540 గ్రాముల బంగారు నగలు, 336 గ్రాముల వెండి స్వాధీనం
- నిందితుడి అరెస్ట్



నిందితుడ్ని అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ డేగల ప్రభాకర్

పలమనేరు: పక్కాగా రెక్కీచేసి తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీలు చేస్తున్న దొంగను పలమనేరు పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్ స్థానిక సీఐ కార్యాలయంలో సోమవారం మీడియాకు తెలిపారు.

పక్కాప్లాన్‌తో..!

పలమనేరులోని రాధాబంగ్లాలో టీడీపీ నాయకుడు సాకేవూరు రామూర్తినాయుడి ఇల్లు చుట్టుపక్కల గృహాలు లేకుండా ఉంది. ఈ ఇంటికి తరచూ లాక్ చేసుండడాన్ని దొంగ గమనించి పక్కాస్కెచ్ వేశాడు. గత నెల 31న ఇంట్లో ఎవరూలేనిది గమనించి సాయత్రం ఐదు గంటలకే ఇంట్లోకి వెళ్లాడు. ఎలాంటి సమస్యా లేకుండా చోరీ చేశాడు. దీనిపై బాధితుడు స్థానిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లాలోని క్రైమ్ పార్టీల ద్వారా విచారణ ముమ్మరం చేశారు.

టెక్నికల్‌గా దొంగను పట్టుకున్నారు!

ఎట్టకేలకు జిల్లా, డివిజన్, స్థానిక క్రైమ్‌పార్టీ నిందితున్ని సోమవారం పట్టణ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పట్టుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కాకినాడకు చెందిన ఆడపాల వెంకట శివ(32)గా తెలిపారు. అతని వద్ద నుంచి చోరీకి సంబంధించిన మొత్తం రికవరీ చేశామన్నారు.

తగ్గేదే లే!

ఈ కేసులో పలమనేరు పోలీసులు పట్టుకున్న శివాపై ఇప్పటిదాకా ఏపీలో 12 కేసులున్నట్టు డీఎస్పీ తెలిపారు. కాకినాడకు చెందిన శివ డిగ్రీ పూర్తిచేసి ఈజీ సంపాదన కోసం చోరీలకి తెగబడ్డాడు. ఆపై హైదరాబాద్‌లో సినీపరిశ్రమలో కొన్నాళ్లుండి ఆపై మళ్లీ కొత్త నేరాలకు దిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు చాలెంజ్‌గా తీసుకున్న డీఎస్పీ డేగల ప్రభాకర్, సీఐ మురళీమోహన్, క్రైమ్ సీఐ ఉమామహేశ్వర్, ఏఎస్ఐ దేవా పలమనేరు సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నిందితున్ని సోమవారం పట్టుకున్నట్టు తెలిపారు. నిందితున్ని కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. ఇందులో సీఐ మురళీమోహన్, క్రైమ్ సీఐ ఉమామహేశ్వర్ ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఉద్యమ బాట

చిత్తూరు కార్పొరేషన్: తమ సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టనున్నారు. వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను ఏపీ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) సిద్ధం చేసింది. జేఏసీలో 1104, 327, డిప్లొమా ఇంజినీర్స్, బీసీ, ఓసీ, బహుజన ఉద్యోగ సంఘాలు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 23 ఉన్నాయి. ఆందోళన కార్యక్రమాలపై జిల్లా జేఏసీ ప్రతినిధులు విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్‌కు నోటీసు ఇవ్వనున్నారు. ప్రధాన సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేనందున ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు జేఏసీ నేతలు తెలిపారు.

ఆందోళన ఇలా
- మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు
- 17, 18 తేదీల్లో భోజన విరామ సమయాల్లో ఆందోళన
- 19, 20 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు
- 22న ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు మెమొరాండం సమర్పించనున్నట్టు జిల్లా జేఏసీ నేతలు గోవిందరాజులు, యజ్ఞేశ్వరరావు, చంద్రమౌళి, చంద్రశేఖర్ పేర్కొన్నారు.

డిమాండ్లు ఇవీ
- నగదు రహిత వైద్యం అందించాలి
- 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలి
- దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలి. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి. దీర్ఘకాలిక సర్వీసు గల వారందరినీ సంస్థలో విలీనం చేయాలి.
- పాత పద్ధతిలోనే కారుణ్యనియామకాలు చేపట్టాలి
- జేఎల్ఎం గ్రేడ్–2లను, జేఎల్ఎంలుగా పరిగణించాలి
- పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను మంజూరు చేయాలి. ఇంజినీరింగ్ డిగ్రీ కలిగిన సబ్‌ఇంజినీర్‌కు, ఏఈలుగా పదోన్నతిలో అవకాశం కల్పించాలి.
- అర్హులైన ఓఅండ్ఎం ఉద్యోగులను జూనియర్ సహాయకులు, సబ్‌ఇంజినీర్‌గా ఖాళీలలో నియమించాలి.
- గతంలో అంగీకరించినట్లు అన్ని విభాగాల్లో ఖాళీలు భర్తీచేయాలి.
- ప్రమాదాలు జరిగినప్పుడు సాంకేతికపరమైన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని సమగ్ర విచారణ జరిపిన తదుపరి చర్యలు తీసుకోవాలి.

కిలో మామిడికి రూ.12 ఇచ్చి తీరాల్సిందే

- కలెక్టరేట్ వద్ద మామిడి రైతుల ధర్నా
- మార్కెట్‌యార్డ్ నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మామిడి సంక్షేమ సంఘం నాయకులు, మామిడి రైతులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మామిడి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.12 ఇచ్చి తీరాల్సిందేనని జిల్లా మామిడి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జనార్దన్, హరిబాబుచౌదరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు, రైతులు సోమవారం మార్కెట్‌యార్డు నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మామిడి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో తోతాపురి మామిడికి సీఎం ప్రకటించిన ప్రకారం కిలోకు రూ.12 చెల్లించి తీరాలన్నారు. మామిడి రైతులకు కచ్చితంగా ఫ్యాక్టరీలు రూ.8, ప్రభుత్వం తరఫున రూ.4 మొత్తం రూ.12 ఒకేసారి ఇవ్వాలన్నారు. సత్వరం రైతుల ఖాతాల్లో నగదు జమచేయాలని డిమాండ్ చేశారు.

రెండు నెలలు దాటినా..!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 35 వేల మంది రైతులు ఫ్యాక్టరీలకు మామిడి సరఫరా చేశారని, రెండు నెలలు దాటినా అటు ఫ్యాక్టరీలు, ఇటు ప్రభుత్వం ఇప్పటి వరకు నిధులు జమచేయకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.12 ఇవ్వకపోతే ఉద్యమాలే శరణ్యమని హెచ్చరించారు. ర్యాంపులు రూ.3, రూ.4 మాత్రమే చెల్లించాయన్నారు. ఫ్యాక్టరీలతో పాటు ర్యాంపుల అధినేతలు రూ.8 చెల్లించి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. రైతుల ఓపికను పరీక్షిస్తే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నెల ఆఖరి లోపు మొత్తం నగదు చెల్లించాల్సిందేనన్నారు. గుడిపాల రైతుసంఘ నాయకులు ప్రకాష్ మాట్లాడుతూ రైతులకు ఏ మాత్రం అన్యాయం జరిగినా సహించేది లేదన్నారు. గౌరవ అధ్యక్షులు ఆనందనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్యాక్టరీలు తక్షణం రూ.8 చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో అక్టోబర్ 1 నుంచి రహదారులు దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, హేమలత, రైతులు భాస్కర్ నాయుడు, మునిరత్నంనాయుడు, బెల్లంకొండ శ్రీనివాసులు, లవకుమార్‌రెడ్డి, సంజీవరెడ్డి, సందీప్, భారతి, చంద్రమౌళి, మురళి, త్యాగరాజులురెడ్డి పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న రైతులు



జాయింట్ కలెక్టర్ విద్యాధరికి సమస్యలు వివరిస్తున్న సంఘ నాయకులు

ఎస్వీయూ అధికారుల తీరుపై ఆగ్రహం

తిరుపతి సిటీ : ఎస్వీయూ అధికారుల తీరుపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి, వర్సిటీలోని సమస్యలపై సోమవారం అన్నమయ్య భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి వర్సిటీ అధికారులు అడ్డకట్ట వేశారు. దీంతో మండిపడిన విద్యార్థి సంఘాల నేతలు యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట బైఠాయించి సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఐసా, పీడీఎస్ఓ, ఎన్ఎస్‌యూఐ, జీఎస్ఎస్, జై భారత్ నేషనల్ పార్టీ విద్యార్థి విభాగం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో–కన్వీనర్ అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ 70 ఏళ్ల విశ్వవిద్యాలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థి సంఘాలను అణగదొక్కేందుకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు యత్నిస్తున్నారని ఆరోపించారు. నేపాల్ పరిస్థితులను తలపించేలా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వర్సిటీ అధికారుల అవినీతిని బయట పెడుతున్నందుకే సెమినార్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశానికి అనుమతి మంజూరు చేయకుండా ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపించారు. అధ్యాపకుల లెటర్ ప్యాడ్‌పై మాత్రమే సెమినార్ హాల్ ఇస్తామని చెప్పి, ఎవరైనా అధ్యాపకులు లెటర్ ఇస్తే జీతాలు నిలిపివేస్తామని రిజిస్ట్రార్ బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరు మారకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వీసీకి వినతిపత్రం సమర్పించారు. నేతలు అక్బర్, రవి, ఉదయ్, ప్రవీణ్, మల్లికార్జున, చిన్నా, శివశంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం



ప్రభుత్వానికి మధ్య వారధిగా, ప్రభుత్వాల దుర్నీతి పాలనను ఎత్తి చూపుతూ రాసే కథనాలపై పత్రిక ఎడిటర్, విలేకరులపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ప్రభుత్వం వ్యతిరేక విధానాలు అనుసరిస్తోంది. ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియాను అణగదొక్కేలా అక్రమ కేసులు పెట్టడం సరికాదు. వైఫల్యాలను, వాస్తవాలను రాస్తున్న సాక్షిపై కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం మంచి పద్ధతి కాదు. సాక్షి పత్రిక, సిబ్బందిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి.

– వి.రెడ్డిశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ నాయకులు



స్వేచ్ఛను హరించడం తగదు



ప్రజాస్వామ్య దేశంలో పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దారుణం. పాత్రికేయులకు స్వేచ్ఛ కల్పించాలి. నిజాలను నిర్భయంగా రాసే వారిపై కేసులు నమోదు చేయడం సబబు కాదు. నాయకులు మీడియా సమావేశాల్లో తెలియజేసిన విషయాలను కూడా పత్రికల్లో వస్తే నేరమనడం హాస్యాస్పదం. లోటు పాట్లను గురించి వాస్తవాలు రాస్తే పత్రికా యాజమాన్యం పై కేసులు నమోదు చేసి విచారణ పేరుతో వేధించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. సాక్షి పై కేసు నమోదు చేయడం అన్యాయం. పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదు. విమర్శలు చేస్తే కేసులు పెట్టడం, ప్రభుత్వ పరిపాలన లోపాలను ఎత్తిచూపితే మీడియా సంస్థలను నియంత్రించాలనుకోవడం అన్యాయం. సాక్షి ఎడిటర్, రిపోర్టర్లపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి.

– ప్రకాష్, విద్యావేత్త

క్లుప్తంగా

మళ్లీ వివాదం

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మళ్లీ వివాదం తలెత్తింది. శుక్రవారం రాత్రి జరిగిన ఘటన మరవక ముందే మళ్లీ.. ఆదివారం రాత్రి ఆస్పత్రిలో ఓ వ్యక్తి చికిత్స కోసం వచ్చి సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. దీంతో ఆస్పత్రిలో పనిచేసే పీజీ వైద్యులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. విధులను బహిష్కరించారు. గంట పాటు ఈ నిరసన కొనసాగింది. రాత్రి పూట భద్రతను పెంచేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.

వీడని మిస్టరీ!

- రెండు మృతదేహాలకు పోస్టుమార్టం
- సమీపంలోని గుంతలను నేడు తవ్వనున్న పోలీసులు
- కీలక ఆధారంగా ఘటనాస్థలంలో దొరికిన సెల్‌ఫోన్

పాశాల : అటవీ ప్రాంతంలో ఆదివారం వెలుగుచూసిన మృతదేహాలకు సంబంధించి ఇప్పటికీ మిస్టరీ వీడలేదు. రాత్రంతా పోలీసులు ఘటనాస్థలంలోనే కాపలా కాశారు. మృతదేహాలు కుళ్లిపోయి ఉండడంతో సోమవారం ఉదయం అడవిలోనే పోస్టుమార్టం నిర్వహించారు. సమీపంలోని రెండు గుంతలను మంగళవారం తవ్వి పరిశీలించాలని నిర్ణయించారు.

హత్యా.. ఆత్మహత్యా..?

అడవిలో మృతదేహాలు ఉన్న ప్రదేశంలో మద్యం సీసాలు పడి ఉన్నాయి. వారు ఆత్మహత్య చేసుకునే ముందు మద్యం తాగారా..? లేకపోతే పురుషుడు మద్యం తాగి మహిళను హత్య చేశాడా.? తర్వాత తాను ఆత్మహత్యకు పాల్పడ్డాడా..? అనే విషయాలు తేలాల్సి ఉంది. లేకపోతే వీరిని ఎవరైనా అడవిలోకి తీసుకువచ్చి హత్య చేసి, తర్వాత మద్య తాగారా అనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికీ సందిగ్ధమే

మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించే సమయంలో వారి నోట్లో గుడ్డలు కుక్కి, ప్లాస్టర్ అంటించి ఉండడాన్ని వైద్యులు గుర్తించినట్లు వార్తలు గుప్పుమన్నాయి. దీంతో వారిని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించి ఉండవచ్చేనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా అసలు విషయం వెలుగు చూడనుంది. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు బయటకు రానున్నాయి.

న్యాయం జరగడం లేదయ్యా!

'ఎన్ని సార్లు మొరపెట్టుకుంటున్నా.. తమకు న్యాయం జరగడం లేదయ్యా' అంటూ అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికకు పలు ప్రాంతాలకు చెందిన అర్జీదారులు విచ్చేసి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 339 అర్జీలు వచ్చినట్టు జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

– చిత్తూరు కలెక్టరేట్



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

సిమెంట్ రోడ్డు మంజూరు చేయాలి

తమ గ్రామానికి సిమెంట్ రోడ్డు మంజూరు చేయాలంటూ గంగాధరనెల్లూరు మండలం, కుప్పనపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన యువరాజ్ మాట్లాడుతూ తమ గ్రామానికి గత 30 ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేదన్నారు. ఎస్ఎస్ కొండ నుంచి తమ గ్రామానికి సిమెంట్ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు.



సిమెంట్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతున్న కుప్పనపల్లి గ్రామస్తులు

భూమిని ఆక్రమించేశారు!



తన భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని నగరి మండలం, ఏకాంబరకుప్పానికి చెందిన దివ్యాంగురాలు దేవకి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ తనకు 1958 నుంచి సర్వే నం.245/261 లో భూమి ఉందని, కొందరు కబ్జాదారులు ఆ భూమిని ఆక్రమించుకున్నారని వాపోయారు.

భూమిని కబ్జాచేసేందుకు కుట్ర



తనపై దౌర్జన్యం చేసి భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చౌడేపల్లి మండలం, రామయ్యగట్టుకు చెందిన సుబ్బులమ్మ వాపోయారు. గ్రామంలో 3 ఎకరాల భూమి ఉందని, కొందరు దౌర్జన్యం చేసి ఆ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. స్థానిక అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గృహహింసకు పాల్పడుతున్నారు



అత్తగారి ఇంట్లో గృహహింసకు పాల్పడుతున్నారని చిత్తూరు నగరం అమ్మన్ కోయిల్ వీధికి చెందిన బాధితురాలు మీనాకుమారి వాపోయారు. న్యాయం చేయాలంటూ పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు. ఆమె మాట్లాడుతూ తన భర్త మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారన్నారు. పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా ఆయన ప్రవర్తనలో మార్పు లేదని ఆవేదన చెందారు.

సర్వేయర్లు పట్టించుకోవడం లేదు



తన భూమిని కొలిచేందుకు పలు మార్లు సర్వేకు దరఖాస్తు చేసుకున్నా సర్వేయర్లు పట్టించుకోవడం లేదని కార్వేటినగరం ఆర్‌కేవీబీపేటకు చెందిన దివ్యాంగుడు మోహన్ వాపోయారు. గ్రామంలో సర్వే నం.154-8 లో ఒక ఎకరా ఐదు సెంట్లు భూమిని ప్రభుత్వం మంజూరు చేసిందని, దానికి హద్దులు నిర్ణయించేందుకు సర్వే చేయించాలని కోరారు.

నేత్రపర్వంగా పూలంగి సేవ

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ప్రత్యేక బ్రహ్మోత్సలను నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. సోమవారం పూలంగిసేవలో స్వామి వారు భక్తులకు అభయమిచ్చారు. కర్పూరహారతులు పట్టి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఊంజల్, ప్రాకారోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు తెప్పోత్సవం

బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన తెప్పోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించనున్నట్టు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం అభిషేకం ఉంటుందన్నారు.

నేడు లడ్డూ బహిరంగ వేలం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మంగళవారం లడ్డూ బహిరంగ వేలం ఉంటుందని ఈవో పెంచలకిషోర్ తెలిపారు. 21 కిలోల లడ్డూ ప్రసాదాన్ని రాత్రి 10 గంటల ప్రాంతంలో వేలం వేయనున్నట్టు వెల్లడించారు.

మద్దతు వి'ఫలం'!

- మామిడికి దక్కని మద్దతు ధర
- ప్రోత్సాహక నిధి చెల్లింపులోనూ జాప్యం
- రోడ్డెక్కుతున్న మామిడి రైతులు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ఫూయవుతోంది. తోతాపురి కేజీకి రూ.4 నుంచి రూ.6 వరకు మాత్రమే చెల్లిస్తోంది. దీనిపై రైతులు రగిలిపోతున్నారు. ఫ్యాక్టరీలు కేజీ తోతాపురికి రూ.8 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహక నిధి రూ.4 చెల్లింపుపై ఆగ్రహానికి గురవుతున్నారు.

కాయలు కొనుగోలు ఇలా...

జిల్లాలోని 43 ఫ్యాక్టరీలో 31 ఫ్యాక్టరీలు మామిడి కొనుగోలుకు ముందుకొచ్చాయి. ఈ ఫ్యాక్టరీలు 49,350 మంది రైతుల నుంచి 2.31 లక్ష మెట్రిక్ టన్నుల దాకా కొనుగోలు చేశాయి. అలాగే ర్యాంపులు 30,600 మంది రైతులు 1.44లక్ష మెట్రిక్ టన్నుల కాయలను ర్యాంపులకు తరలించినట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. అయితే కాయలు ఫ్యాక్టరీలకు తరలించి నెలలు గడుస్తున్నా ఇంత వరకు నగదు చెల్లించలేదు.


కిలోకు రూ.6 వరకు చెల్లింపు

కూటమి ప్రభుత్వం తోతాపురికి మద్దతు ధర ప్రకటించింది. ఫ్యాక్టరీలు కిలోకి రూ.8 చొప్పున కొనుగోలు చేయాల ని ఆదేశించింది. ప్రభుత్వం తరపున ప్రోత్సాహక నిధి కింద మరో రూ.4 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే కొన్ని ఫ్యాక్టరీలు కిలోకి రూ.4 నుంచి రూ.6 వరకు చెల్లిస్తున్నాయి. ఇక ప్రభుత్వ ప్రోత్సాహక నిధి రూ.4 చెల్లింపులోనూ జాప్యం జరుగుతోంది.

ముందే చెప్పిన ఫ్యాక్టరీలు

మామిడి దిగుబడి, ఎగుమతిని దృష్టిలో ఉంచుకుని పళ్లగుజ్జు పరిశ్రమలు ఈసారి మామిడి కొనుగోలుపై ఆసక్తి చూపలేకపోయాయి. అయితే జిల్లా యంత్రాంగం పట్టుబడడంతో చాలా ఫ్యాక్టరీలు కాయలు కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చాయి. తోతాపురి కేజీ రూ.4, రూ.5, రూ.6కే కొనుగోలు చేస్తామని బోర్డులు సైతం పెట్టాయి. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర చెల్లించలేమని ఫ్యాక్టరీలు తేల్చి చెప్పాయి.

చర్యలు ఉంటాయి



మద్దతు ధర ఇవ్వాలని ఫ్యాక్టరీలకు నోటీసులు ఇచ్చాం. కిలోకి రూ.4 ఎక్కడా ఇవ్వడం లేదు. ఆ బ్యాంకు వివరాలు ఇస్తే కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటాం. మద్దతు ధర ఇవ్వకపోతే కరెంటు కట్ చేయిస్తాం. పొల్యూషన్ బోర్డు ద్వారా చర్యలు ఉంటాయి.

– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, చిత్తూరు

మమ్మల్ని ఎందుకు మోసం చేశారు?

'ఏడేళ్ల నుంచి డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యా.. డీఎస్సీలో ఎంపికయ్యా. కాల్‌లెటర్ పంపారు. సర్టిఫికెట్లన్నీ పరిశీలించి ఓకే అన్నారు. చివరికి తుది ఎంపిక జాబితాలో ఎంపిక కాలేదని చెప్పారు'..అంటూ పలమనేరుకు చెందిన సుమన్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకంటే తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులకు పోస్టులు వచ్చాయన్నారు. అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక తమ ఆశలను నీరుగార్చడం అన్యాయమని ఆవేదన చెందాడు.

'ఎస్జీటీ పోస్టుకు ఎంపికైనట్లు మెసేజ్ పంపారు. కాల్‌లెటర్ జారీచేశారు. సర్టిఫికెట్ల పరిశీలన మొత్తం పూర్తి చేశారు. ప్రస్తుతం తుది జాబితాలో నా పేరు లేదు..' అని శ్రీకాళహస్తికి చెందిన ఓ మహిళా అభ్యర్థిని కన్నీరుపెట్టుకున్నారు. సోమవారం డీఈవో కార్యాలయానికి విచ్చేసిన తనకు జరిగిన అన్యాయంపై అధికారులను ప్రశ్నించారు. తన తర్వాత ర్యాంక్ ఉన్న వారికి పోస్టు ఇచ్చారని ఆరోపించారు.

ఈ ఇద్దరే కాదు.. సోమవారం చిత్తూరు డీఈవో కార్యాలయానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వందలాది మంది అభ్యర్థులు క్యూకట్టారు. కాల్‌లెటర్లు అందిన తమను ఎందుకు ఎంపిక చేయలేదంటూ అధికారులను ప్రశ్నించారు. ఇది మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ అంటూ విమర్శలు ఎక్కుపెట్టారు.

- మెగా డీఎస్సీ తుది జాబితాలో పలువురు అభ్యర్థులకు అన్యాయం
- దూరప్రాంతాల నుంచి డీఈవో కార్యాలయానికి పరుగులు
- అవమానించి మోసం చేశారంటూ కూటమి ప్రభుత్వం పై విమర్శలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని తిరుపతి, శ్రీకాళహస్తి, మదనపల్లి, కుప్పం, చిత్తూరు, పుత్తూరు పలు ప్రాంతాల నుంచి మెగా డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థులు డీఈవో కార్యాలయానికి విచ్చేశారు. ర్యాంకు, మార్కుల పరంగా అర్హత ఉన్న తమకు అన్యాయం జరిగిందంటూ అధికారులకు మొరపెట్టుకున్నారు. పీఈటీ, ఇతర కేటగిరిలతోపాటు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన వారి సర్టిఫికెట్లు సమగ్రంగా విచారించలేదని ఆరోపించారు. ఈడబ్ల్యూఎస్, పీహెచ్ కేటగిరీల్లో అనర్హులకు అందలం ఎక్కించారన్నారు.

తుది జాబితాలో 1,408 మంది ఎంపిక

రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సోమవారం ప్రచురించిన మెగా డీఎస్సీ తుది జాబితాలో 1,408 మంది ఎంపికైనట్లు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కేడర్‌లలో 1,478 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేశారు. ఈ ప్రక్రియ తుది జాబితా ప్రచురణ నాటికి పలు కేడర్‌లలో 1,408 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. తుది ఎంపిక జాబితాలను కలెక్టరేట్, డీఈవో కార్యాలయ నోటీసు బోర్డులలో ప్రచురించారు. తుది జాబితాలో అభ్యర్థులకు ఎవరైనా అభ్యంతరాలున్నట్లైతే కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ 8498991250 నెంబర్‌లో తెలియజేయాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఎస్సీ తుది ఎంపిక

మేనేజ్‌మెంట్	నోటిఫైడ్ పోస్టులు	ఎంపికైన అభ్యర్థులు	అర్హత లేక భర్తీ కాని పోస్టులు
ప్రభుత్వ. లోకల్‌బాడీస్	1,312	1,254	58
మున్సిపాలిటీ	64	57	07
మున్సిపల్ కార్పొరేషన్	97	92	05
ట్రైబల్‌ఆశ్రమ పాఠశాలలు	05	05	00
మొత్తం పోస్టులు	1,478	1,408	70



డీఈవో కార్యాలయంలో తమకు ఎలా అన్యాయం జరిగిందంటూ అధికారులను నిలదీస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

దసరా మహోత్సవాలకు ఆహ్వానం



జేసీ విద్యాధరికి ఆహ్వాన పత్రికలను అందజేస్తున్న ఈఓ ఏకాంబరం

చిత్తూరు కలెక్టరేట్/ చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు జిల్లా అధికారులకు ఈఓ ఏకాంబరం సోమవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జేసీ విద్యాధరి, డీఎఫ్ఓ భరణి, పలమనేరు ఆర్డీఓ భవానితోపాటు పలువురు అధికారులకు ఆహ్వాన పత్రికలు అందజేసి అందజేసి సత్కరించారు. కుటుంబ సమేతంగా దసరా వేడుకల్లో పాల్గొనాలని కోరినట్లు ఈఓ తెలిపారు.

నిందితుడికి రిమాండ్

చిత్తూరు అర్బన్: ప్రభుత్వాస్పత్రిలో వైద్యులపై జరిగిన దాడి కేసులో నిందితుడిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. చిత్తూరు నగరానికి చెందిన మొగిలీశ్వర్ అనే విద్యార్థి రక్తగాయాలతో శుక్రవారం రాత్రి జిల్లా ప్రభుత్వాస్పత్రిని ఆశ్రయించాడు. చికిత్స చేసే క్రమంలో వైద్యులకు.. విద్యార్థి, అతని స్నేహితులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆపై విద్యార్థి, అతని స్నేహితులు కలిసి ముగ్గురు వైద్యులను చితకబాదారు. ఓ వైద్యుడి ముక్కును పగులగొట్టారు. దీంతో వైద్యులు నిరసనకు దిగడం, ఫిర్యాదు చేయడంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మొగిలీశ్వర్‌ను సోమవారం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ

రొంపిచెర్ల: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకుని ఒకరు మృతి చెందగా.. భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన ఘటన బెంగళూరు-తిరుపతి జాతీయ రహదారి, రొంపిచెర్ల మండలం, అదర్శ పాఠశాల సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు.. అన్నమ్మయ్య జిల్లా, పీలేరు మండలం, ఇందిరమ్మ కాలనీకి చెందిన విజయకుమార్ (23), భార్య రాజేశ్వరి(20) ద్విచక్ర వాహనంలో పీలేరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో రొంపిచెర్ల గ్రామ పంచాయతీ లక్ష్మీనారాయణ కాలనీకి చెందిన ఎం.ఎస్.మహమ్మద్ గౌస్‌పీర్(38) రొంపిచెర్ల నుంచి పీలేరు వైపు ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. ఈ రెండు వాహనాలో ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం మహమ్మద్ గౌస్‌పీర్‌ను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఆయన రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి ఒక భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. కుటుంబ యాజమాని మృతి చెందడంతో వారి కుటుంబం రోడ్డున పడింది. భార్యాభర్తలు ఇరువురూ పీలేరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రొంపిచెర్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.